క్లుప్తంగా

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ సెంటర్‌ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి

సోమల: మండలంలోని ఆవులపల్లె సచివాలయంలో శనివారం నూతన ఆధార్ సెంటర్‌ను తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం గ్రామ సచివాయంలోనే ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని కొత్త కార్డులు, తప్పు ఒప్పులు, మొబైల్ నంబర్ లింక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మణికుమార్, వైఎస్సార్ సీపీ నేత రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ నమోదును వేగవంతం చేయండి

రొంపిచెర్ల: మండలంలో జరుగుతున్న ఆధార్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసినట్టు ఎంపీడీవో రాజేంద్ర ఆదేశించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో రెండు గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 430 మంది ఆధార్ నమోదు చేయని చిన్నారులు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇప్పటి వరకు 187 మంది పిల్లలు మాత్రమే ఆధార్ నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు జనన ధ్రువీకరణ పత్రాలతో ఆధార్ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. రొంపిచెర్ల-2, మోటుమల్లెల గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమో దు కేంద్రాలు పని చేస్తున్నాయని అన్నారు.

పులిచెర్ల తహసీల్దారుగా శేషగిరిరావు



శేషగిరిరావు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల తహసీల్దారుగా శేషగిరిరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న అమర్నాథ్ రొంపిచెర్లకు బదిలీ అయ్యారు. రైతుల రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తానని ఆయన తెలిపారు.

రొంపిచెర్ల తహసీల్దార్‌గా అమర్నాథ్

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల తహసీల్దార్‌గా అమర్నాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మురాషావలిని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. పులిచెర్లలో పని చేస్తున్న అమర్నాథ్‌ను రొంపిచెర్లకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ సమస్యలను నేరుగా వచ్చి తనకు చెప్పవచ్చన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎంపీపీ ఈశ్వరయ్య తెలిపారు. ఆయన శనివారం స్థానిక సర్పంచ్ వనజమ్మ ఆధ్వర్యంలో అన్నెమ్మగారిపల్లెలోని గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన దారి సమస్యను ఇరు వర్గాల వారితో మాట్లాడి పరిష్కరించామని, అలాగే ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పీఏ మురళీకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం, ఎంపీటీసీ సర్వేశ్వరమ్మ, నేతలు రమణారెడ్డి, యాగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

పులిచెర్ల(కల్లూరు): పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని పీలేరు సహాయ కార్మిక శాఖాధికారి ఆనందబాబు హెచ్చరించారు. ఆయన శనివారం కల్లూరులో బేకరీలు, నిత్యావసర దుకాణాలు, వెల్డింగ్ షాపులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ, కరణంవారిపల్లె సమీపంలోని అభయాంజనేయస్వామి, చౌడేపల్లెలోని ఆంజనేయస్వామి, గాండ్లపల్లె వద్దనున్న ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

22న పలమనేరుకు శ్రీరామ పాదుకలు

పలమనేరు: అయోధ్య నుంచి పలమనేరు పట్టణానికి ఈనెల 22న శ్రీరాముని పాదుకలు ఇక్కడి ప్రజల దర్శనార్థం వస్తున్నాయని మాజీ కౌన్సిలర్ కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పట్టణవాసులతో శనివారం సమావేశం నిర్వహించారు. శ్రీరాముని పాదుకలకు ఇంటింటా పూజలు నిర్వహించి స్థానికుల దర్శనార్థం ఆలయాల్లో వారం రోజుల పాటు ఉంచనున్నట్టు తెలిపారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వసేవలు

గతంలో ప్రభుత్వ పథకాల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. మధ్యవర్తులకు కొంత ముట్టచెబితేకాని పనులు జరిగే పరిస్థితి లేదు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. సుమారు 540 సేవలను స్థానికంగానే అందజేస్తూ సచివాలయాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. సేవలపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- దేశంలోనే ఆదర్శంగా సచివాలయ వ్యవస్థ
- గ్రామాల్లోనే 540 సేవలు
- ఇబ్బందులు తప్పాయంటున్న ప్రజలు



చౌడేపల్లె మండలంలోని పుదిపట్ల సచివాలయం

మండలంలోని కుటుంబాలు :	13,250
సచివాలయాలు :	15
నిర్మాణానికి చేసిన ఖర్చు రూ :	6 కోట్లు
గ్రామ వలంటీర్లు :	228
సచివాలయ సిబ్బంది :	135
పరిష్కరించిన సమస్యలు :	319

పథకం	లబ్ధిదారులు	అందుతున్న లబ్ధి
అమ్మ ఒడి	4391	రూ.13.48కోట్లు
వైఎస్సార్ పింఛను	7240	రూ.27.87కోట్లు
వైఎస్సార్ చేయూత	3789	రూ.7.20కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	3929	రూ.10.24కోట్లు
వైఎస్సార్ వాహన మిత్ర	249	రూ.22.38 లక్షలు
జగనన్న విద్యా దీవెన	1557	రూ.35.33 లక్షలు
జగనన్న చేదోడు	806	రూ.28.24 లక్షలు
జగనన్న తోడు	1800	రూ.14.97 కోట్లు
ఈబీసీ నేస్తం	1255	రూ.90.09 లక్షలు
వైఎస్సార్ ఆసరా	6713	రూ.10.45 కోట్లు

చౌడేపల్లె: మండలంలో 13,250 కుటుంబాలు ఉన్నాయి. వీరికి సేవలు అందించేందుకు 15 సచివాలయాలను ఏర్పాటుచేశారు. వీటిలో 135 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి అదనంగా 228 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వరం సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ సేవలు, జనన, మరణ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరు చేస్తున్నారు. అంతేగాక పన్నుల చెల్లింపు, భూముల వివరాల ఈసీ నమోదు, సర్వేతోపాటు పలు సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

సొంత ఇంటి కల నెరవేరింది



సచివాలయాలు ఏర్పాటు చేసినటప్పటి నుంచి ప్రభుత్వ పథకాలు మాకు ఇంటి వద్దకే చేరుతున్నాయి. నాకు సొంత ఇల్లు లేదని గతంలో పలుమార్లు అర్జీలిచ్చినా పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఏర్పాటుచేసిన సచివాలయంలో అర్జీ ఇచ్చాను. విచారించి నాకు అధికారులు ఇళ్లు మంజూరు చేశారు. దశవాల వారీగా బిల్లు చెల్లించారు. నా ఆశయం నెరవేరింది. – కె.జయశ్రీ, చిత్రెడ్డిపల్లె

జగనన్నకు రుణపడి ఉంటా



ఆపదలో ఉన్న తమ కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిస్తూ ఆదుకుంటున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. నేను మానసిక వికలాంగుడిని. వికలాంగ పింఛను కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ న్యాయం జరగలేదు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ సహకారంతో సమస్యను పరిష్కరించారు. నాకు నెల నెలా రూ.3 వేల పింఛను అందజేస్తున్నారు. – జి.లోకేష్, చిత్రెడ్డిపల్లె

సేవలకు గుర్తింపునిచ్చారు



ఉన్నత ఆశయంతో ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థలో పనిచేయడం నా అదృష్టం. ప్రజలకు అన్ని సేవలందిస్తున్నా. నాసేవలను గుర్తించిన అధికారులు నాకు వజ్ర అవార్డు ఇచ్చింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సత్కరించి రూ.30 వేలు ఆర్థిక ప్రోత్సాహకం అందించారు. నా బాధ్యత రెట్టింపు అయింది. ఇంకా బాధ్యతగా సేవ చేస్తా. – కె.శశికళ, వలంటీర్, చిత్రెడ్డిపల్లె

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: మండలంలోని నంజంపేటలో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య మాట్లాడుతూ సీఎం సహాయ నిధి నుంచి నంజంపేటకు చెందిన అహమ్మద్‌బాషాకు రూ.30 వేలు, కందూరుకు చెందిన రామసుబ్బయ్యకు రూ.80 వేలు మంజూరైనట్టు వివరించారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శీలం భాస్కర్, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు హరినాథ్ పాల్గొన్నారు.



చౌడేపల్లె: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చౌడేపల్లె: మండలంలో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పంపిణీ చేశారు. కాటిపేరికి చెందిన సుజాతమ్మకు రూ.70 వేలు, చారాలకు చెందిన టి.రత్నమ్మకు రూ.20 వేలు, లద్దిగం చాకలి రెడ్డెప్పకు రూ.20 వేలు, చౌడేపల్లెకు చెందిన కేవీ రాజన్నకు రూ.62 వేలు మంజూరైంది. మంత్రి పీఏ మునితుకారం, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



నట్టల నివారణ మందు తాగిస్తున్న వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి

చౌడేపల్లె: మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ ముదిరెడ్డిపల్లెలో శనివారం పశువైద్యాధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ఉచితంగా గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ మందు తాగించడం ద్వారా జీవాలు ఆరోగ్యకరంగా, బలంగా, చురుగ్గా ఉంటాయని, వ్యాధుల నుంచి తట్టుకొనే శక్తి కలుగుతుందన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

పలమనేరు: చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం మార్కెట్‌కు బైక్‌లపై వచ్చే రైతులను వాహనాల తనిఖీ పేరిట జరిమానాలు వేసి ఇబ్బందులు పెట్టరాదని గంగవరం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. హైవేలో వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తే బాగుంటుందన్నారు. కానీ రకరకాల పనులపై నిత్యం పట్టణానికి వచ్చే సామాన్యుల, రైతులపై పోలీసులు ప్రతాపం చూపుతున్నారని, ఇది సరికాదన్నారు. ముఖ్యంగా కానిస్టేబుళ్ల జనం పట్ల వాడే భాష అమర్యాదగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

మండల అభివృద్ధే ధ్యేయం



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అమరనాథ్

వి.కోట: మండలాభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు పని చేస్తున్నారని జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అమరనాథ్ అన్నారు. శనివారం మండలంలోని యాలకల్లు పంచాయతీ ఎర్రినాగేపల్లి గ్రామంలో జెడ్పీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా పరిమాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

9న కళామందిర వార్షికోత్సవ పోటీలు

పలమనేరు: పట్టణ సమీపంలోని కళామందిరం వార్షికోత్సవం సందర్భంగా జులై 9వ తేదీన పిల్లలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్టు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగుభాష రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై ఏడు నుంచి పది తరగతుల పిల్లలు రెండు పేజీల వ్యాసం, 1 నుంచి 6 తరగతుల పిల్లలు ఇదే అంశంపై చిత్రలేఖనం, వందకుపైగా నీతి పద్యాలు చెప్పగలిగే పిల్లలు 9346249011 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని అందులో సూచించారు.

ఇళ్ల స్థలాల కోసం గుడారాలు వేసిన గ్రామస్తులు

రామకుప్పం: మండలంలోని బూరుగుమాకులపల్లె ప్రభుత్వ స్థలంలో తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు గుడిసెలు వేసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో 1.64 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నట్లు తెలిపారు. 2022వ సంవత్సరంలో ఈ భూమిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, బల్క్‌మిల్క్ సెంటర్ భవనాల ఏర్పాటుకు 35 సెంట్లను రెవెన్యూ అధికారులు కేటాయించారని పేర్కొన్నారు. ఈ భూమి విషయమై అదే గ్రామానికి చెందిన వ్యక్తి కోర్టులో కేసు వేయడంతో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయని, మిగిలిన భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తాము గుడిసెలు వేసుకున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మురళీ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకున్నారు. ఇళ్ల స్థలాలను అర్హులకు అందజేస్తామని, రెవెన్యూ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. ఇళ్ల స్థలాల విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులకు ఇంటిపట్టాలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్సీ భరత్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

తొలకరి రాకతో పులకింత



పలమనేరు సమీపంలో మబ్బులు పట్టిన ఆకాశం

- పలమనేరులో తగ్గిన పగటి ఉష్ణోగ్రత
- వేసవితాపం నుంచి జనం రిలాక్స్
- తొలకరి వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపు

పలమనేరు: ఇన్నాళ్లూ ఎండ కారణంగా ఉక్కబోతతో అల్లాడిన పలమనేరు వాసులకు శనివారం ఉపశమనం లభించింది. నైరుతీ రాకకు సూచికగా ఉదయం నుంచి ఎండ తగ్గింది. ఆకాశం మబ్బులు పట్టి గాలులు వీస్తున్నాయి. తీవ్రమైన ఉక్కబోతతో ఇన్నాళ్లు రోడ్లపై కనిపించని జనం శనివారం బయటకు రావడంతో రద్దీగా మారింది. నేటి నుంచి పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. దీంతో తొలకరి వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వేరుశనగ విత్తనాలను సిద్ధంగా ఉంచుకున్నారు. వర్షం పడితే అదునులో విత్తనాలేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు..

పేదవాని ఊటీగా పేరున్న పలమనేరు ప్రాంతంలో ఏటా వేసవిలోనూ 37 డిగ్రీల కంటే మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. అయితే ఈ దఫా మొన్నటిదాకా పగటి ఉష్ణోగ్రతలు 39 నుంచి 40 దాకా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం 34 డిగ్రీలుగా నమోదై సాయంత్రానికి 32కు చేరింది. నేటి నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు భారీగా తగ్గి 26కు చేరే అవకాశం ఉంటుంది. నేటి నుంచి పగటి ఉష్ణోగ్రతలు సైతం 26కు మించవని స్మార్ట్‌ఫోన్లలో వెదర్ రిపోర్ట్స్ చూపెడుతున్నాయి.

వీధుల్లో పెరిగిన జనం రద్దీ..

గత నెలరోజులుగా వేసవి కారణంగా ఉదయం పది గంటలకే జనం రోడ్లపైకి రావడం మానేశారు. పూర్తి నిర్మానుష్యంగా రోడ్లు కనిపించేవి. అయితే శనివారం చల్లటి గాలులు, ఆకాశంలో మబ్బుల కారణంగా సూర్యతాపం కనిపించలేదు. దీంతో జనం వీధుల్లో హాయిగా తిరగడం కనిపించింది. వ్యాపారాలు ఎక్కువగా జరిగే బజారువీధి, జవళివీధి, గంగమ్మగుడివీధి, రంగాపురం సర్కిల్, గుడియాత్తం సర్కిళ్లలో రద్దీ కనిపించింది.

తొలకరి కోసం ఎదురుచూపు..

పలమనేరు ప్రాంతంలో ఎక్కువగా మెట్ట భూములు ఉన్నాయి. వర్షాధార పంట అయిన వేరుశనగ ఈ డివిజన్‌లో 16వేల హెక్టార్లలో సాగవుతుంది. ఈ దఫా ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను మే నెలాఖరులోనే రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసింది. విత్తనాలను సిద్ధం చేసుకున్న రైతులు అదునులో వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. శనివారం వాన వచ్చే సూచనలు కనిపించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం మండలంలోని కొంగనపల్లె పంచాయతీ పరిధిలోని కొల్లుపల్లె, వెంకటాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగారు. పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అట్టడుగు, బడుగు,బలహీన వర్గాలకు సీఎం అధిక ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం రూ.లక్షల్లో లబ్ధి పొందిందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. కొంగనపల్లె ఎస్సీ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు రూ.10 లక్షలను ఎమ్మెల్సీ భరత్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా పనుల ప్రారంభం కోసం ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. కొల్లుపల్లె, వెంకటాపురం గ్రామాల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు, నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ కళమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సౌందర్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుగుణప్ప, నేతలు అరవింద్, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, వైస్ సర్పంచ్ సుబ్రమణ్యం, రాధాకృష్ణా, పద్మనాభం, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులు



సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న అలీమ్‌బాషా, కొండవీటి నాగభూషణం

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని చంద్రకాంత్ వీధిలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ప్రారంభించారు. రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము పనులను పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి రోడ్డు వేయాలని వినతి వచ్చినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగింపు కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.90 లక్షలు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నరసింహులు, కాంట్రాక్టర్ కొండవీటి నరేష్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



పులిచెర్లలో విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి



విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఈఓ సాయిలీల



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్న హెచ్‌ఎం, నాయకులు

పులిచెర్ల(కల్లూరు): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. పులిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన అనుషకు రూ.3 వేలు, గ్రీష్మాకు రూ.2 వేలు, సాయిపృథికి రూ.వెయ్యి బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సిద్ధరామయ్య, నాదమునిరెడ్డి, ప్రసాద్, గోవర్దన్, ప్రభాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ రేష్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

బైరెడ్డిపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు చక్కగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎంఈఓ సాయిలీల అన్నారు. మండల పరిధిలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవడం జరుగుతుందన్నారు. కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభ, ఏటీపీ కిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ రూప, కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులను సాధించిన పిల్లలకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం నగదు ప్రోత్సాహకాలను అందించారు. పాఠశాలలో ఫస్ట్ మార్కులు పొందిన నందినికి రూ.3 వేలు, రెండో స్థానం సాధించిన పి.నందినికి రూ.2 వేలు, మూడోస్థానంలో నిలిచిన స్వప్నకు రూ.వెయ్యి నగదుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్, సర్పంచ్ గోవిందస్వామి, వైస్ సర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు మనోజ్ రెడ్డి, వీరభద్రతోపాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నలభై బాటిళ్ల డిఫెన్స్ మద్యం పట్టివేత






సెబ్ అధికారుల తనిఖీల్లో పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న మిలిటరీ మద్యం

పలమనేరు: బెంగళూరు నుంచి బస్సులో నెల్లూరుకు తీసుకెళ్తున్న డిఫెన్స్ అకాడమీకి చెందిన 40 ఫుల్ బాటిళ్లను స్థానిక సెబ్ పరిధిలోని చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. శనివారం తనిఖీలు చేపట్టిన సెబ్ అధికారులు బస్సుల్లో డిఫెన్స్ మద్యాన్ని తరలిస్తున్న నెల్లూరుకు చెందిన సత్యనారాయణ(45)ను అరెస్ట్ చేసి మద్యం సీజ్ చేశారు. నిందితున్ని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

కిక్కిరిసిన గొర్రెల వారపుసంత



బైరెడ్డిపల్లెలో జరుగుతున్న వారపుసంతకు హాజరైన గొర్రెలు, రైతులు



బైరెడ్డిపల్లెలో వారపుసంతలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న గొర్రెపొట్టేళ్లు

బైరెడ్డిపల్లె : ఈనెల 29న బక్రీద్ పండుగ సందర్భంగా బైరెడ్డిపల్లెలో శనివారం నిర్వహించిన గొర్రెల వారపు సంత కిక్కిరిసింది. బక్రీద్ పండుగ కోసం గత కొంతకాలంగా రైతులు వ్యవసాయ పొలాల వద్ద గొర్రెలను ఏపుగా పెంచుతున్నారు. బక్రీద్ పండుగ సమీపిస్తుండడంతో గొర్రెలను వారపు సంతకు తీసుకువచ్చారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో వారపుసంతకు హాజరయ్యారు. జత పొట్టేళ్లు రూ.70 వేల నుంచి రూ.1.20 లక్షలు ధర పలికాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.